ఆదర్శాలూ-అనుభవాలూ

ఇల్లిందల సరస్వతీదేవి

రామారావు, పుండరి, సువర్చల వెళ్ళేసరికి ఆఫీసరు కుటుంబమంతా నలుగురు కూతుళ్ళూ ఇద్దరు కొడుకులు, ఆయన శ్రీమతి హాల్లో కూర్చుని ఉన్నారు.

"రండి రండి మీకోసమే ఎదురు చూస్తున్నాం" ఆఫీసరు కేశవరావు ఎదురుగా వెళ్ళాడు ముగ్గురునీ ఒక సోఫాలో కూర్చోబెట్టాడు.

రెండు నిముషాలసేపు ఎవరూ మాట్లాడలేదు. ఎయిర్ కూలర్ హాయి గొలుపుతుంటే అలుపు తీర్చుకుంటున్నట్టు కూర్చుండిపోయాడు.

అయిదు నిమిషాలలో నలుగురమ్మాయిలూ లేచి కాఫీ టిఫిన్లు అందించారు. మాట్లాడుతూ టిఫిన్ తింటూ కేశవరావు పుండరిని ఒక కంటితో పరీక్షగా చూస్తున్నాడు. ఆయన శ్రీమతి కూడా పుండరిని ఆపాద మస్తకం పరిశీలనగా చూస్తూనేవుంది.

"అయితే రామారావుగారూ! వీరిని సరిగా పరిచయం చేయండి." అంటూ సన్నగా నవ్వాడు కేశవరావు. అంతకు ముందు రామారావు చెప్పిన క్లుప్తపరిచయము చాలదన్నట్టు.

"వీడు మీ అన్నగారి కుమారుడు. వీరుడు యమ్ ఇెక్ ప్యాసయ్యాడు. బొంబాయిలో ఉద్యోగం వచ్చింది. వీడు కవల పిల్లలలో ఒకడు కావటాన మా ఆవిడ నెలపిల్లవాడప్పటినుంచీ పెంచింది. మాదగ్గరే మెట్రిక్యులేషన్ వరకూ చదువుకున్నాడు. పై చదువులన్నీ మదరాసులో చదివాడు. ఉద్యోగంలో చేరబోతూ మా యిద్దరినీ చూడాలని వచ్చాడు." టిఫిన్ పూర్తి చేసి కాఫీ కప్పందుకున్నాడు రామారావు.

అంతలో నలుగురమ్మాయిలూ టిఫిన్ తీసుకుంటూ వాళ్ళలో వాళ్ళు మెల్లగా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. అబ్బాయిలు రవి, చంద్ర బెల్‌బాటమ్‌పాంట్లు బుజాలు తాకే తల వెంట్రుకలు కూనిరాగాలు తీస్తూ పుండరిని బూట్లమీద దృష్టి కేంద్రీకరించి చూస్తున్నారు.

కేశవరావు శ్రీమతి కామాక్షమ్మ, పుండరి హాల్లోకివచ్చి కూర్చున్న తరువాత సువర్చలతో తన కూతుళ్ళ మదువుల గురించి సంస్కారాన్ని గురించి అలవాటు చొప్పునగొప్పగా వర్ణించి చెప్పడం మొదలు పెట్టింది.

సువర్చల మరీ అధునికంగా కనబడకపోయినా అమె అలంకరణతో దిద్దుబాటులో నూతనత్వము ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. ఎదటివారి మాటల్లోని లోటుపాటులను క్షణాల మీద గ్రహించి అంచనా వేయ గలదు. కాని తనుమాత్రం పట్టుబడదు. ఆమె అక్కడ కూర్చున్న అమ్మాయిలను చూసినట్టు పైకి కనబడకుండా బాగా చూసింది.

ఇద్దరమ్మాయిలు నైలెక్సు చీరలు కట్టారు. ఒకమ్మాయి పంజాబ్ డ్రెస్‌లోవుంది. ఒక అమ్మాయి లుంగీకట్టి వదులుగా జాకెట్టుధరించింది. ఛాయ తక్కువయినా అందరికీ కనుముక్కు తీరు బాగున్నది.

కేశవరావు మధ్యలో భార్యవంక చూశాడు. ఆమె గ్రహించి "ప్రతిమా సితార్ తీసుకురా" అన్నది.

సువర్చలతోపాటు రామారావుకూడా నలుగురిలో ప్రతిమ ఎవరోననుకుంటూ చూశారు. ఎర్రటి ద్రాక్షగుత్తులచీరె కట్టుకుని చేతులులేని బ్లౌజుధరించిన అమ్మాయి మెల్లగా లేచి లోపలికి వెళ్ళి సితార్ తీసుకువచ్చి, ఒక ప్రత్యేకమయిన బల్లమీద కూర్చుని వాయించటం మొదలుపెట్టింది.

"మా ప్రతిమ రవిశంకర్ సభ్యుడికి శిష్యురాలండి. సంగీతంలో అమ్మాయికి డిగ్రీకూడా ఉంది" తండ్రి ప్రతిమను అబ్బురంగా చూస్తూ చెప్పాడు రామారావుతో,

ప్రతిమ అరగంటసేపు భజనలు వాయించింది. తానం, పల్లవి వాయించింది. రెండు సినిమా పాటలు మహమ్మద్ రఫీవి వాయించింది. ఆమె కళ్ళు మూసుకుని వాయించుతుంటే ఆమె కురచవెంట్రుకలు ఇటూ అటూ తలతోపాటు ఊగటం మొదలుపెట్టాయి. ఆమె సితార్ వాయించుతున్నంతసేపూ కన్నార్పకుండా చూశారు.

ముగ్గురమ్మాయిలు కాలివేళ్ళతో తాళం వేస్తూచూస్తున్నారు. వాళ్ళల్లో మాలిని రెండవ అమ్మాయి. క్షణాలమీద మనిషిని చూసి తన దృష్టిలో ఏ తరగతిలో చేర్చాలో నిశ్చయం చేసెయ్యగలదు. పుండరి హాల్లోకి నడచివచ్చిన తీరూ, కూర్చునేతీరూ, కాఫీతాగే పద్ధతీ, టిఫిన్ చేతివేళ్ళతో నోట్లోపెట్టుకునే విధమూ, నమిలేపద్ధతీ గమనించింది. నవ్వేతీరూ కూడా బాగా కనిపెట్టి చూసింది.

రామారావు, కేశవరావు లేచారు. వాళ్లను చూసి సువర్చల లేచింది:

"రామారావుగారూ! మళ్ళీ కలుద్దాము. అయితే మీ అబ్బాయి ఉంటాడా నాలుగు రోజులు?" అన్నాడు క్రాపు సవరించుకుంటూ కేశవరావు'

"లేదండీ. రెండుమూడు రోజుల్లో వెళ్ళి పోతాడు. ఉద్యోగంలో చేరాలట. ఇక్కడి నుంచి వెళ్ళి మా అన్నగారిదగ్గర ఒకరోజు ఉండి అక్కడినుంచి బొంబాయి రైలెక్కుతాడు"

"అలాగా! అయితే నేను రేపే మిమ్మల్ని ఇంట్లో కలుసుకుంటాము. రాత్రి ఎనిమిదింటికి నేనూ మా శ్రీమతి వస్తాము" అన్నాడు.

వాళ్ళను వీధివాకిలివరకు సాగనంపి కేశవరావు. రామారావుతో స్నేహానికి కాస్త ఇవతలిగా వచ్చి, నెమ్మదిగా అడిగాడు

"కట్నకానుకలు పెద్దఎత్తులో ఉంటాయా?" అంటూ.

"అబ్బెబ్బే! ఆ మాట మావాడి దగ్గర—మా అన్నయ్య దగ్గర అనకూడదు—వినకూడదు" అన్నాడు రామారావు.

ఆ రాత్రి భోజనాలయిన తరువాత బైట కుర్చీలు వేసుకుని కేశవరావు కుటుంబమంతా సమావేశమయ్యారు. కేశవరావు తమలపాకులు నములుతూ సిగరెట్టొకటి ముట్టించాడు.

"మీరంతా కడుపులో దాచుకుంటారు. ఏ సంగతీ పైకి చెప్పరు. ఎలా ఉన్నాడు అబ్బాయి?" అడిగింది కామాక్షమ్మ.

"మీరంతా ఒక్కొక్కళ్లే చెప్పండి మీ మీ అభిప్రాయాలు" అన్నాడు పైకి పొగ వదుల్తూ కేశవరావు.

"నాన్నా! ఆదేమిటి క్రాపు అంతసున్నగా దువ్వుకున్నాడు కిందికి! ఆ సూటు—ఆ టై కట్టుకోవటమూ—ఆ మెరిసే బూట్లు—ఏదోకొత్త బిచ్చగాడు ప్రొద్దెరగడు అన్నట్టుగా ఉంది అతడి వేషము" అన్నది మాలిని.

ఆమె తరువాత లిల్లీ మరీ చురుకు. "అదేమిటి నాన్నా! నవ్వుటంకూడా సహజంగాలేదు. సినిమాలో పోజు ఇచ్చినట్టుగా ఉంది" అన్నది.

"పళ్ళు చూశావా ఎలా పేర్చినట్టుగా ఉన్నాయో! అవి సహజమైనవేనా అని నా సందేహం" ప్రమీల నిర్భయంగా తన అభిప్రాయం చెప్పేసింది.

అబ్బాయిలిద్దరూ ఒక్కసారే గొంతెత్తారు "మరీ పూర్వకాలం మనిషి నాన్నా! ప్రతిమ అంత చక్కగా వాయిస్తుంటే లేచి దగరగా వెళ్ళి మెచ్చుకోవద్దూ? కూర్చున్న చోటనుంచే చూస్తున్నాడు కదలలేనివాడిలా. తను ఈడు వాళ్ళం ఎదురుగా ఉంటే ఒక్క మాటయినా మాట్లాడాడా! మన ప్రతిమనా అటువంటివాడికివ్వటం! మాకేంనచ్చలేదు" అంటూ.

కేశవరావు వాళ్ళ రిమార్కులన్నీ శ్రద్ధగా విన్నాడు. సిగరెట్టుముక్క దూరంగా విసిరేసి, ఆఫీసరుహోదా ఒక్కువిరుపు అయిన తరువాత "కామూ! నీవు?" అన్నాడు.

"నా మనసులో ఏమున్నదో సరిగ్గా లిల్లీ, ప్రమీల, మాలిని చెప్పేశారు. నేనూ మొదటి నుంచీ గమనిస్తూనే ఉన్నాను. పిల్లవాడు ఎర్రగా ఉండగానే సరా! ఉద్యోగం పెద్దదవగానే సరా! ఈకాలం పిల్లలకు నచ్చేటట్టు మాటా-పలుకూ-నడతా ఉండాలా? ముసలాడు కూర్చున్నట్టు మీ యిద్దరిమధ్యా ఇరికి కూర్చున్నాడు" కామాక్షమ్మ తన రిమార్కులన్నీ ఏకరువు పెట్టింది.

"పిల్లవాడు బాగున్నాడు, మంచిఉద్యోగం మొదట్లోనే వచ్చింది. ముందు ముందు ఇంకా పైకి పోతాడు, విదేశాలకు వెళ్లే అవకాశాలు వస్తాయట. మనమ్మాయికూడా వెళుతుంది. అన్నిటికంటె అబ్బాయి చాలా మంచివాడు. ఎటువంటి దురభ్యాసమూ లేదని పినతండ్రి చెప్పాడు" కేశవరావు నిబ్బరంగా చెప్పుకుంటూ పోతున్నాడు.

కామాక్షమ్మ తలలోపూలు సవరించుకుంటూ ఆలోచిస్తున్నది. ఎందుకో ఆమె మనసు వెలితివెలితిగా ఉంది.

"ప్రతిమను అడిగావా? అభిప్రాయం కూడా కనుక్కో"

"ముందు మనందరికీ నచ్చితే దాన్నిఅడగవచ్చుగాని మనకే సందేహాలు తీరకపోతే దాన్నేమని అడగటం?" కామాక్షమ్మ ప్రతిమవంక చూసింది

"అతడికి చాలా ఆస్తి ఉన్నదని కూడా రామారావు చెప్పాడు. తండ్రి మంచి స్థితిమంతుడు. ఇతడివాటాకే దాదాపు ఏభయివేల వరకూ ఉంటుందని అంచనా" కేశవరావు ఉత్సాహంగా చెబుతున్నాడు.

"ఆఁ అసలు పాయింటు మీరే వింటారు. అంత ఆస్తిగల పిల్లవాడు బాగా చదివినవాడు మొదటే పెద్ద ఉద్యోగం వచ్చినవాడూ నేనూ కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటానంటుంటే మీకు అనుమానం కలగటం లేదండీ? కట్నం నగదుగా కాకపోయినా వస్తురూపేణా కూడా వద్దంటున్నా రంటున్నారు. ఇందులో ఏదో తిరకాసు ఉన్నది." తన తెలివికి తానే మురుస్తూ ముక్కుపుటాలెగుర వేసింది కామాక్షమ్మ.

"ఏముంటుంది?" ఆమె ఆర్గ్యుమెంటును కొట్టివేస్తు అన్నారు.

"ఏముంటుంది?" నలుగురు పడుచు ప్రతిష్ఠలు గలది కాక పోవచ్చు. లేదా పిల్లవాడిలో ఏదో లోపం అయినా ఉండవచ్చు మొత్తానికి ఏదోవుంది. ఏ లోపమూ లేకపోతే అలాఎందుకంటారు?" కామాక్షమ్మ చెప్పింతా పిల్లలు విన్నారు.

"అవున్నాన్నా!" అన్నది మాలిని.

Phone : Factory : 29262

SUSRUTA

SURGICAL INDUSTRIES

(Registered Under Small Scale Industries No. 01-08-40315)

Office : 5-4-526, Behind Hotal Annapurna,
Nampalli, HYDERABAD-500001

Factory : B/65, Assisted Industrial Estate,
Balanagar, Hyderabad-500037

Distributors for :

HOSLAB EQUIPMENT COMPANY

BOMBAY

"సరిగ్గా అంతే" అన్నది ప్రమీల

"నేను మొదటే అనుకున్నాను" అన్నది లిల్లీ.

లలిత, ప్రమీల, మాలిని ఒక్కసారే కళ్ళు మెరిసేటట్టు చూశారు తల్లిముఖంలోకి. ఇంక ప్రతిమ వరుగ నక్కర లేదన్నట్టుగా.

మగపిల్లలు దిలీపు, సురేందర్ హేళనగా నవ్వుకుంటూ లేచి వెళ్ళి పోయారు.

బరువుగా నిట్టూర్చి లేచాడు కేశవరావు.

మరునాడు సాయంత్రం మర్యాదకని ఒక్కడే రామారావింటికి వెళ్ళాడు కేశవరావు.

పుండరి ఇంట్లో లేడు. పినతల్లితో సినిమాకు వెళ్ళాడు. అరగంటకు పైగా కేశవరావు ఆ మాట ఈ మాటా మాట్లాడాడు కాని పెళ్ళి మాటల ప్రసక్తి లేదు. ఎన్నాళ్ళనుంచో సంబంధాలు చెప్పమని వేధిస్తున్న కేశవరావు మాట్లాడకపోవటంతో రామారావు ఆశ్చర్యంగా చూశాడు. కాని తనకు తాను ఆ ప్రసక్తి తేదలచలేదు.

పుండరి పినతండ్రికీ, పినతల్లికీ బట్టలు పెట్టాడు. వాళ్ళ ఆశీర్వచనంతో రైలెక్కాడు. పన్నెండు గంటలు ప్రయాణంచేసి ఇల్లు చేరుకున్న పుండరికి తలనొప్పితోపాటు నాలుగు వాంతులయ్యాయి. తల్లి గాభరా పడిపోయింది. తండ్రి గబగబా నాలుగిళ్ళ అవతలవున్న డాక్టరును రమ్మని ఫోను చేశాడు.

డాక్టర్ పి. కె. రావు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వచ్చాడు. సంగతంతా తెలుసుకుని "ఇతన్ని నా కారులో నా నర్సింగ్ హోముకు తీసుకువెళ్ళి పరీక్షచేసి మందిచ్చి పంపుతాను. నేనే స్వయంగా తీసుకువచ్చి దింపుతాను" అన్నాడు స్టెత్ ఊగించుతూ.

"పదండి నేనూ వస్తాను. సీరియస్ కాదు కదా?" అంటూ చెప్పులేసుకుని బయలుదేరాడు శ్రీనివాసరావు.

నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళగానే గబగబా ఒక ఇంజక్షన్ ఇచ్చాడు డాక్టరు. ఎందుకయినా మంచిదని గ్లూకోస్ ఎక్కించాడు. రెండు మూడు గంటలకు పైగా రెస్టు తీసుకోమని చెప్పాడు. మత్తుగా పడుకున్నాడు పుండరి.

డాక్టర్ని ఏమీ అడగలేక-మనసు కొంత పరచుకోలేక గాబరా పడిపోతున్నాడు శ్రీనివాసరావు. ఆయనకు ఒళ్ళంతా కంపిస్తున్నది. చెమటతో షర్టంతా తడిసిపోయింది. మాటిమాటికీ ఉత్తరీయంతో పాలభాగమంతా ఒత్తుకుంటున్నాడు.

పన్నెండుగంటలకు సుమారు డాక్టరు రావు వచ్చాడు. వస్తూనే రెండు కప్పుల కాఫీ తెప్పించి ఒకటి శ్రీనివాసరావుకిచ్చి తానొకటి తీసుకుంటూ "ఏమోయ్ పుండరీ, వికారం తగ్గిందా? ఇప్పుడేం లేదు కదూ?" కప్పు కిందపెట్టి పుండరిని మరొక గదిలోకి తీసుకువెళ్ళి బ్లడ్ ప్రెషర్, మలమూత్రాల పరీక్ష, రక్తము నాలుగయిదు రకాల పరీక్ష, గుండె శ్వాసకోశాల పరీక్ష మొదలైనవన్నీ క్షుణ్ణంగా చేశాడు.

నాలుగు వాంతులకింత పరీక్ష అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు పుండరి.

"శ్రీనివాసరావుగారూ! మీ అబ్బాయికేం భయంలేదు. నాపని కూడా అయిపోయింది.

పదండి మిమ్మల్నిద్దర్నీ ఇంట్లో దింపుతాను. ఇప్పటికే మీ భోజనాలకు ఆలస్యమైంది." అంటూ కారుదగ్గరికి వచ్చాడు. ఆయనవెనకే పుండరి, శ్రీనివాసరావు చేరుకున్నారు కారు దగ్గరికి.

తలుపు తెరిచేసరికి "ఇంత ఆలస్యమయిందేమిటి నాన్నా?" అంటూ దిగి వచ్చింది ఒక ఇరవై ఏళ్ళ అమ్మాయి.

"కాంచేముపని ఎక్కువగా వుందమ్మా ఇవ్వాళ. అన్నట్టు ఈయన శ్రీనివాసరావుగారు రిటైర్డు జడ్జి, ఇతడు పుండరీకాక్షయ్యగారి అబ్బాయి. బొంబాయిలో ఉద్యోగమయింది." అంటూ పుండరిని చూసి "ఇది మా అమ్మాయి నిర్మల. హౌస్ సర్జన్‌గా వుంది గవర్నమెంటు హాస్పిటల్లో. ఒక్కతే అమ్మాయి కదా అతి గారాబము." నవ్వాడు మురిపెంగా డాక్టరు రావు.

పుండరినీ శ్రీనివాసరావును దింపుతూ "శ్రీనివాసరావుగారూ! రాత్రికి వచ్చి చెబుతాను రిజల్ట్సు. అన్ని టెస్టులూ చేశాను. భోజనంచేసి హాయిగా నిద్రపోండి." అంటూ వెళ్ళిపోయాడు.

"ఏమిటినాన్నా ఇదంతా? ఈయన మీకు బాగా తెలుసా?" అన్నాడు విసుగుదలచూపిస్తూ పుండరి భోజనం చేసేటప్పుడు.

"అదేమిట్రా? ఎరక్క పోవడమేమిటి? మనవాళ్ళే ఎక్కడో బంధుత్వము కలిసేవుంటుంది. ఒకటేళాఖముందు సంబంధం కలుపుకోవాలని ఉన్నట్టు శకుంతలమ్మగారు డాక్టరు రావుగారు అంటున్నారు కూడాను" అలసిపోయి వచ్చిన కొడుక్కు గ్లాసులో మంచినీళ్ళు పోసింది మాణిక్యమ్మ.

పైకి ఏమీ మాట్లాడలేదు పుండరి. శ్రీనివాసరావు భోజనం చెయ్యగానే నిద్రకారిగాడు.

రాత్రి తొమ్మిది గంటలవేళ డాక్టరురావు శకుంతలమ్మ వచ్చారు. మాణిక్యమ్మ తడబడుతూ వాళ్ళకు మర్యాదచేసి సోఫామీద కూర్చోబెట్టింది.

"శ్రీనివాసరావుగారూ! మీ వాడి ఆరోగ్యం పరుఫెక్టుగా ఉంది. అన్ని పరీక్షల ఫలితాలూ బాగున్నాయి. ఆఁ అయితే మీవాడి ప్రయాణమెప్పుడూ?" అన్నాడు వికసించిన ముఖంతో

"టికెట్ కొన్నాడు. రేపురాత్రికే ప్రయాణం. మళ్ళీ మేమూ మా అమ్మాయి ఇంత పెద్దఇంట్లో ఏమిటో అది ఎం. ఎ. ప్యాసయితే గాని పెళ్ళి చేసుకోదట. మా ఆవిడ ఒకటే తొందర మనవలకోసం." అంటున్నాడు కాలు మీద కాలు వేసుకుని చిరునవ్వుతో.

"ఏడీ మీ అబ్బాయి?" ఆత్రంగా డాక్టరు రావు శకుంతలమ్మా అడుగుతున్నారు.

"వెళ్ళిపోతాను కదా అని స్నేహితులనందరినీ కలుసుకోవటానికి వెళ్ళాడు. వాడికి స్నేహితులుంటే అన్నం నీళ్ళూ అక్కర్లేదు" శ్రీనివాసరావు జవాబిచ్చాడు.

పుండరిని పంపటానికి శ్రీనివాసరావు, మాణిక్యమ్మ పద్మిని స్టేషనుకు వెళ్ళారు. కళ్ళనీళ్ళతో మాణిక్యమ్మ మాట్లాడలేక పోతున్నది. పద్మిని అన్నతో లొడలొడ కబుర్లు చెప్పుతూ చెయ్యి పట్టుకుని లాక్కుపోతున్నట్టుగా నడుస్తున్నది.

కొడుక్కు అన్ని జాగ్రత్తలూ చెప్పి "పుండరీ, నాలుగునెల్ల తరువాత నీకు ఉత్తరం వ్రాస్తాను సెలవుపెట్టి వచ్చెయ్యి. నిన్నొక ఇంటివాణ్ణి చేసేవరకూ అమ్మ నిద్ర పోయేటట్టులేదు." అంటూ కదులుతున్న రైలుతోపాటు నాలుగడుగులు వేస్తూ "నాయనా! ఆరోగ్యం జాగ్రత్త. ఉత్తరం వ్రాస్తూఉండు. తెలుసుగా మీ అమ్మ సంగతి?" వెనక్కు తిరిగాడు శ్రీనివాసరావు.

కళ్ళమీదినుంచి కొంగు తియ్యలేదు మాణిక్యమ్మ. అన్న కనబడేవరకు చెయ్యూపుతునే ఉంది పద్మిని.

కొత్త ఉద్యోగం కొత్తఊరు- కొత్తస్నేహితులు- ఇరవై నాలుగు గంటలూ చాలటంలేదు పుండరికి. నెలయ్యేసరికి పుండరి బొంబాయిని బాగా అకళింపు చేసుకున్నాడు. తను పని చేస్తున్న కంపెనీలోనే తనమిత్రుడు మణికి కూడా ఉద్యోగం సంపాదించి పిలిపించాడు. ఇద్దరూ కలిసి ఒకఫ్లాట్ తీసుకుని స్వయంపాక మారంభించారు.

"ఆశ్వియుజమాసంవచ్చింది.చూసిన రెండు సంబంధాలలో ఒకటి నిశ్చయం చేస్తాము, మంచి ముహూర్తాలున్నాయి. రమ్మ"నమని తండ్రి రెండు ఉత్తరాలు వ్రాశాడు. ఆరెండు సంబంధాల వివరాలు వ్రాస్తూ "పుండరీ!ఇద్దరూ అందంగా వుంటారు. స్థితిమంతుల పిల్లలు. వచ్చి పెళ్ళిచేసుకుని వెళ్ళు. అన్నట్టు మన పద్మిని ఏమంటోందో తెలుసా? బాబాయిచెప్పిన సంబంధం కంటే మన డాక్టరుగారి నిర్మల బాగుందని అమ్మను కూడా ఒప్పించింది, నాకెవరయినా ఒకటే. నీ అభిప్రాయం వ్రాయి. ఏదయినా నీ మాటే ఆఖరుమాట. అంతా నీ ఇష్టం. ఎప్పుడువస్తున్నావో వ్రాయి." అంటూ ముగించాడు.

వారం రోజులయింది. పుండరి మనసంతా కుతకుత ఉడికి పోతోంది. పెళ్ళిమాట తలచుకుంటే రోషముకొద్దీ ముఖం ఎర్రబడి పోతున్నది, ముక్కు పుటాలు అదురు తున్నాయి. తండ్రికేం జవాబు వ్రాయాలో తెలియకుండా ఉంది.

కాని అతడి మనసులో ఆవేదన తల్లిదండ్రుల పట్ల మమతానురాగాలు- భక్తిగౌరవాలు పెల్లుబుకుతూ ఉంటాయి. ఎటువంటి పరిస్థితులలోను తండ్రివ్రాసిన జాబులకు జవాబివ్వక పోతే అవిధేయత అనిపించు కుంటుంది, తల్లి కన్నీరు తాను చూడలేడు, చిలిపి చిన్నారి చెల్లెలి మనసు నొప్పించలేడు.

దసరా పండుగలకు వస్తున్నానని వ్రాశాడు అప్పటికా పండుగ సరిగ్గా పదిరోజులుంది.

లంచ్ టైములో సుమన "హలోపుండరి!" అంటూ హాండ్ బ్యాగ్ ఊపుకుంటూ వచ్చింది. ముట్టుకుంటే మాసిపోతుందేమో అన్నట్టుగా ఉంటుంది దేహచ్ఛాయ. ఎంతో వినయవిధేయతలతో పని చేస్తుంది. నిరాడంబరంగా అలంకరించుకునే సహజ సుందరి. వారంరోజుల క్రిందటే ఊరినుంచి వచ్చింది. ఉన్న ఒక్కగానొక్క తల్లి చనిపోయిందట ఆరు నెలల క్రిందట. దుఃఖపు పొంగు తగ్గిన తరువాత ఇల్లు, వాకిలి అమ్మి ఆ ఊరితో తెగతెంపులు చేసుకుని వచ్చేసింది. అప్పటి కప్పుడు పుండరికి తెలియలేదు. ఆమె కెదురుగా కూర్చుని "ఎప్పుడొచ్చారు?" అన్నాడు ఎటూతోచక

ఆ మాటకే సుమనకు దుఃఖము పొంగినది ఐదు నిమిషాల వరకూ మాట్లాడలేక పోయింది. తనకుతానే తర్ధుకుంది. కొంతసేపటికి, కళ్ళుతుడుచుకుని- ముంగురులు ప్రక్కకు తోసుకుంది, తలపైకెత్తి చల్లటినవ్వు పెదవులమీదికి తెచ్చుకుంటూ "పుండరీ నేను మా ఊరినుంచి ధైర్యంగా వచ్చేశాను కాని ఇక్కడికి రాగానే ఆ ధైర్యం కాస్తాజారిపోయింది" మళ్ళీ ఆమెకు దుఃఖము ముంచుకు వచ్చింది.

తండ్రిపెట్టిన గడువు దగ్గరికి వచ్చింది. వస్తానని వ్రాసినతేదీ మరునాటితో చెల్లు. దీనినిగురించే రాత్రింబవళ్ళు ఆలోచిస్తున్న

పుండరి వెంటనే సుమనచెయ్యి పట్టుకున్నాడు సమ్మోహనంగా.

ఆమె నివ్వెరపోయింది.

"అట్లా నా ముఖంలోకి చూడకు. సరిగ్గా నీవంటి అమ్మాయికోసమే నేను గాలిస్తున్నా దేశమంతా. రేపు మనమిద్దరం సెలవుపెట్టి రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్దాంపద" లేవటానికి ఆమెకు తనచెయ్యి అందించాడు.

దశమినాటి ఉదయం గడపలో నిలబడ్డ పుండరీ సుమలను చూసి శ్రీనివాసరావు పలకరించటానికి తడబడ్డాడు. మాణిక్యమ్మ నోరు తెరిచింది. పద్మిని సుమనుచూస్తూ కన్నార్పటం మరచిపోయింది.

పుండరి సుమను చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకువచ్చి హాల్లో నిలబడ్డాడు. మాణిక్యమ్మ శ్రీనివాసరావుగార్లు ఒకరి ముఖం ఒకరుచూసి కళ్ళతో ప్రశ్నించుకుంటున్నారు.

పుండరి గొంతు సవరించుకున్నాడు.

"అమ్మా! నాన్నా! ఇదిగో మీ కోడలు - సుమన. మహారాష్ట్రుల యింటిపిల్ల, జాగీర్దారుల ఇంటిపడుచు. కట్నం తీసుకోనంటున్నానని నాకు మెడికల్ టెస్టులు చేయించకుండా- నన్నూ నావంశ గౌరవాన్ని శంకించకుండా— నా ఆదర్శాన్నిమెచ్చి పెళ్ళిచేసుకుంది. మన వాళ్ళకు ఆదర్శాలు ఆచరించకుండా అట్లాగే ఉండాలి, నినాదాలు చేయటానికి." అంతేగాని నాటోటివాడు ఆచరించ బూనుకుంటే సందేహించేవాడే కాని — సంతోషించేవాడు లేడు. ఈ సుమన నాతోకూడా పనిచేస్తోంది. నేను చదివినంతా చదివింది. నాకు వచ్చినంత జీతము ఆమెకూ వస్తుంది"

శ్రీనివాసరావుకూ మాణిక్యమ్మకూ నమస్కరించారు ఇద్దరు.

మాటా పలుకూ లేకుండా మౌనంగా భోజనాలవేళ—కాఫీలవేళ గడిచిపోయింది, ఆరాత్రి పద్మినితోకూడా సినిమాకు వెళ్ళారు సుమన, పుండరి.

తెల్లవారిలేచి స్నానంచేసి వంటమనిషి కంటె ముందర కాఫీచేసి అత్తగారికీ, మామగారికీ అందించింది సుమన. పెళ్ళి అయిన తరువాత ఇంగ్లీషులిపిలో తెలుగు కొద్దిగా నేర్చుకున్న సుమన "అత్తయ్యా, నామీద కోపం లేదుకదూ, కట్నము ఇవ్వనంటే మాతండ్రిని అందరూ హీనంగా చూశారు. పుండరితో ఆ మాటే అంటే నన్నెంతో గౌరవించి పెళ్ళి చేసుకుంటానన్నాడు. మా అమ్మా నాన్న పోయిన తరువాత నేను ఒంటరిగా ఎవరూ లేనిదానిగా బ్రతకలేకపోయాను. ఇప్పుడు నాకెంతో సంతోషంగా ఉంది. మామయ్యా, నామీద కోపం లేదుకదూ!" చేతులు జోడించింది సుమన.

శ్రీనివాసరావు కండ్లలో ఇందుప గింజలంత బాష్పాలు నిలిచాయి,

మాణిక్యమ్మ "నా తల్లే! నేనుండగా నీకేం కష్టం?" ఆమె తలను గుండెలకు హత్తుకుంది.

శ్రీనివాసరావు మెదడులో ఆ రెండు సంబంధాల వాళ్ళు అట్లా అనుకున్నారని పుండరికెట్లా తెలుసునా అన్నమాట తొలిచి వేస్తున్నది. పుండరి స్నేహితుడు దినమణి కండ్లముందర నిలచాడు. కొడుకుమీద మమతతోపాటు గౌరవముకూడా పెరిగింది. మయసటి రోజునుండీ చెప్పవలసిన సమాధానాలు ఆలోచించుకున్నాడు. ఇది సంఘము చేసే ఎందుకు చేశావంటుంది. చేయకపోతే ఎందుకు చేయలేదంటుంది. మరి!